


నేడు రాజాంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-రాజాం

కలెక్టర్ ఎ. సూర్యకుమారి శనివారం రాజాంలో పర్యటించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు రాజాం నియోజకవర్గంలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు, ప్రభుత్వ సేవలు అందించడంపై నాలుగు మండలాల అధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్షలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు జిఎంఆర్ కళాశాలలో ఓటర్ల నమోదుపై విద్యార్థులతో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ముఖాముఖిలో పాల్గొంటారు. 11 గంటలకు గృహనిర్మాణం, గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్ష చేస్తారు. 11.45 గంటలకు మనబడి నాడు – నేడు పనులపై సమగ్ర శిక్ష, విద్యా శాఖ అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం స్పందన, గ్రామ వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై, గృహాల సర్వే, వ్యవసాయ సంబంధిత శాఖలపై సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, నీతి ఆయోగ్ సూచికలు, వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ లకు సంబంధించిన అంశాలపై సమీక్ష చేస్తారు.



అప్‌గ్రేడ్ సరే... సదుపాయాల మెరుగెప్పుడు?

- సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రుల్లో వైద్యుల కొరత
- బదిలీ అయినవారిని రిలీవ్ చేయని వైద్యకళాశాల ప్రిన్సిపల్
- నత్తనడకన భవన నిర్మాణాలు
- రోగుల అవస్థలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పేరుకు అవి ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు. కానీ, వాటి స్థాయికి తగ్గట్టుగా సదుపాయాలు కల్పించలేదు. వైద్యులను నియమించినా ఇప్పటికీ వారు చేరలేదు. దీంతో, రోగులకు తగిన వైద్యసేవలు అందడం లేదు. అటు రోగులు, తగిన వసతి లేక ఇటు సిబ్బంది అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని ఎస్.కోట, గజపతినగరం, రాజాం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లను ఏరియా ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేసిన సంగతి తెలిసిందే. వీటితోపాటు చీపురుపల్లి, భోగాపురం, బాడంగి, నెల్లిమర్ల, బొబ్బిలి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో పడకల స్థాయిని పెంచారు. ఆసుపత్రుల్లో సదుపాయాలను పెంచినట్టు తెగేసి ప్రచారం చేయడంతో అదే నమ్మకంతో వస్తున్న రోగుల సంఖ్య ఘననీయంగా పెరిగింది. ఎస్.కోట ఆసుపత్రి ఏరియా ఆసుపత్రిగా మారాక పడకల స్థాయి 50 నుంచి 100కు పెరిగింది. నెలకు ఔట్ పేషెంట్ల సంఖ్య 18వేల వరకు ఉంటుంది. కానీ, అందుకు తగ్గట్టు వసతులు లేవు. ఇక్కడ రూ.12.60కోట్ల వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో, ఇక్కడ పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించినప్పటికీ, వారు కూర్చోవడానికి తగినంత చోటు లేదు. వసతే చాలడం లేదంటే ఫర్నీచర్ సంగతి వేరేగా చెప్పనక్కర్లేదు. గజపతినగరం, రాజాం ఏరియా ఆసుపత్రిల్లోనూ ఇదే పరిస్థితి. జిల్లా కేంద్రాసుపత్రిని వైద్యకళాశాలగా మార్పుచేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఇక్కడ పనిచేసిన 22మంది వైద్యులను జిల్లాలోగల మొత్తం మూడు ఏరియా ఆసుపత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో వైద్య విధాన పరిషత్ సర్దుబాటు చేసింది. వీరి స్థానంలో సుమారు 20మంది వైద్యులను మెడికల్ కాలేజీ తరఫున వచ్చినప్పటికీ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రిలీవ్ చేయకపోవడంతో ఏరియా, సిహెచ్‌సి ఆసుపత్రుల్లో ఫిజీషియన్, గైనకాలజీ, ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్ తదితర కీలకమైన విభాగాల స్పెషలిస్టులు అందుబాటులో లేరు. ఇలా ఓవైపు వైద్యుల కొరత, మరోవైపు సదుపాయాల లేమి వల్ల ఇప్పటికీ జిల్లా కేంద్రానికే రోగులు పరుగులు తీయాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఏరియా ఆసుపత్రుల్లో 22మంది, సిహెచ్‌సిల్లో 12మంది చొప్పున వైద్యులు ఉండాలని వైద్యవిధాన పరిషత్ నిబంధనలు స్పష్టం చేస్తున్నప్పటికీ ఏ ఒక్క ఆసుపత్రిలోనూ అందుకనుగుణంగా నియామకాలు జరగలేదు. దీంతో, తమకు పనిభారం ఎక్కువగా ఉంటోందని ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ రంగంలో.. నూతన ఆవిష్కరణలు

- పంటల మార్పిడికి ప్రాధాన్యం
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

మారుతున్న పరిస్థితులను బేరీజు వేసుకుంటూ వ్యవసాయ రంగంలో వచ్చే నూతన ఆవిష్కరణలను స్వాగతించాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. సంప్రదాయ పద్ధతులను గౌరవిస్తూనే సాగు విధానంలో ఆధునిక పద్ధతులను అవలంభించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె పలు అంశాలపై మాట్లాడారు. ఎప్పుడూ ఒకే రకమైన పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని రైతులకు సూచించారు. తక్కువ కాలంలో అందుబాటులోకి వచ్చే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో అవలంభించిన నూతన విధానాల ఫలితంగా ఈ ఏడాది వరి దిగుబడి ఎకరాకు మూడు క్వింటాలు పెరిగిందని, ఇదే ఒరవడి కొనసాగించేలా వ్యవసాయ శాఖ పని చేయాలని కలెక్టర్ నిర్దేశించారు. వచ్చే సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని మైనర్ సాగునీటి కాలువలను అభివృద్ధి చేయాలని, పూడికలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి తేమ శాతం కొలిచే యంత్రాలను, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. బ్యాంక్ గ్యారంటీలకు సంబధించిన పెండింగ్ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సూచించారు. మూడో పంట కాలంలో పండే అపరాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రైతులకు ఆర్థిక ప్రయోజనాలను చేకూర్చాలని సూచించారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక పద్ధతులను ఆశ్రయించటం ద్వారా సాగు ఖర్చును తగ్గించాలని, ఈ మేరకు ప్రయోగాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు. దోమలు, కీటకాల ధాటిని తట్టుకొనే విధంగా వంగడాలను తయారు చేయాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులను ఆహ్వానించాలని హితవు పలికారు. నిర్ణీత కాలంలో పంటలు వేసేలా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు.

సీడ్ డ్రిల్లింగ్, జీరో టిల్లేజ్ విధానాలకు ప్రాధాన్యం

రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన ప్రిన్సిపాల్ సైంటిస్ట్ పివి సత్యనారాయణ వ్యవసాయ రంగంలో జరుగుతున్న పరిణామాలు, అనుసరించాల్సిన విధానాల గురించి పలు సూచనలు చేశారు. జీరో టిల్లెజ్ (దుక్కి దున్నకుండా) విధానాన్ని అనుసరించటం ద్వారా సాగు ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి డెల్టా పరిధిలో ఈ విధానాలను అవలంబిస్తూ ప్రయోజనాలు పొందుతున్నారని, కావున ఉత్తరాంధ్ర జిల్లాల్లో కూడా వీటికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. తక్కువ కాలంలో అందివచ్చే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. మట్టి నాణ్యత, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సాగు విధానాలను పాటించాలని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వ్యవసాయ శాఖ జేడీ వి.టి. రామారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు, పశు సంవర్ధక శాఖ జేడి రమణ, సివిల్ సప్లయి డిఎం మీనా కుమారి, మత్స్య శాఖ డిడి నిర్మలా కుమారి, మార్కెటింగ్ శాఖ ఏడి శ్యామ్ కుమార్, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్ర వేత్తలు, నీటిపారుదల, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

22న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

విజయనగరం : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22న ఉదయం 10.30గంటలకు మంగళవారం ఉదయం 10–30 గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో జరుగుతుందని సిఇఒ డాక్టర్ ఎం.అశోక్ కుమార్ తెలిపారు. చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లా పరిషత్ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

గణాంక వివరాలు పరిశీలన

విజయనగరం టౌన్ : 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను నగరపాలక సంస్థ గణాంక వివరాలను ఆర్‌డి (ఆడిట్) బి. సీతారామారావు శుక్రవారం పరిశీలించారు. అన్నీ సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి అరుణకుమారి, నగరపాలక సంస్థ గణాంక అధికారులు సీతారామూర్తి, వెంకటలక్ష్మి, రాజు పాల్గొన్నారు.

జనవరి 23, 24, 25 తేదీల్లో శంబర పోలమాంబ జాతర

ప్రజాశక్తి మక్కువ

శంబరలో వేంచేసి ఉన్న పోలమాంబ అమ్మవారి జాతర తేదీలను ఖరారు చేశారు. శుక్రవారం సాయంత్రం చదురు గుడిలో ఆలయ ట్రస్టీ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడుతో పాటు, గ్రామ పెద్దలు ఆలయ కార్యనిర్వహణ అధికారి బి ఎల్ నగేష్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 2023 జనవరిలో జరగనున్న అమ్మవారి జాతర తేదీలను, మారు జాతర, తదుపరి 10 వారాల తేదీలను అంతా ఏకాభిప్రాయంతో ఖరారు చేశారు. ఈ మేరకు ఈ ఏడాది డిసెంబర 19న శంబర జాతరలో ప్రధాన ఘట్టమైన పెద్ద పాలమాంబను తెచ్చేందుకు సనప చాటింపు వేస్తారు. తదుపరి డిసెంబర్ 21న పెదపోలమాంబను గ్రామంలోకి తీసుకొస్తారు. జనవరి 4న అంపకం చేస్తారు. అదే రోజు చిన పోలమాంబను తెచ్చేందుకు సనప చాటింపు, జనవరి 9న చినపోలమాంబను గ్రామంలోకి తెస్తారు. జనవరి 23న పోలమాంబ జాతర తోలేళ్ల ఉత్సవం, 25న పోలమాంబ జాతరలో ప్రధాన ఘట్టమైన సినిమానోత్సవం, జనవరి 26న పాలమాంబ అమ్మవారి అంపకోత్సవం, జనవరి 31న పోలమాంబ వారి జాతర, మార్చి 28న చండీ హెూమం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ గంజి కాశినాయుడు, విరినాయుల్లు పొడిపిరెడ్డి శివున్నాయుడు, అక్కాన నరసింగరావు, గిరడ శ్రీనివాసరావు, కుప్పిలి గోపి, సర్పంచ్ సింహాచలమమ్మ, అల్లు తిరుపతిరావు, తీళ్ల శ్రీరాములు, గొంగాడ సింహాచలం, గంజి తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ప్రజా గొంతుకై పనిచేస్తా..

పరిచయ సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా గొంతుకనై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతాంగ, నిరుద్యోగ వాణిని చట్ట సభల్లో వినిపిస్తానని, వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ అన్నారు. రమాప్రభ పరిచయ సభ శుక్రవారం ఎన్‌జిఒ హోమ్‌లో యుటిఎఫ్ జిల్లా నాయకులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమాప్రభ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు అండగా ఉంటామన్నారు. పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే నిర్బంధాలు విధించడం సరికాదన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటులో ఉందన్నారు. అన్ని వర్గాల సమస్యలపైనా క్షేత్ర స్థాయిలో అవగాహన ఉందని, తనను గెలిపిస్తే వాటి పరిష్కారానికి పని చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ చట్టసభల్లో ప్రజావాణి వినిపించే వారు లేరని, చట్టసభలలో ప్రజలు,



పరిచయ సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

నిరుద్యోగులు, కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, రైతాంగ సమస్యలు పరిష్కారానికి పని చేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు ఉద్యోగుల హక్కులపై దాడి చేస్తున్నారని, ఉద్యమ నేపథ్యం ఉన్న రమాప్రభను గెలిపించాలని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ పాలనకు అడ్డుకట్ట వేయాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీగా రమాప్రభను గెలిపించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమప్రభకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, జన విజ్ఞాన వేదిక నాయకులు శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అకారణంగా శస్త్రచికిత్స చేస్తే చర్యలు

- నిబంధనలు పాటించని ప్రయివేట్ ఆస్పత్రులకు నోటీసులు
- వైద్యాధికారులకు కలెక్టర్ సూర్యకుమారి ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

కేసులో తీవ్రత, సరైన కారణం లేకుండా గర్భిణులకు సిజేరియన్ చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ప్రైవేట్ ఆస్పత్రులను హెచ్చరించారు. జూలై నుంచి అక్టోబర్ వరకు జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలపై కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, శిశు సంక్షేమ శాఖ పీడీ, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ తదితరులు పాల్గొని మాతాశిశు మరణాలను గల కారణాలను తెలిపారు. చిన్నారుల మతులకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చిన్న చిన్న కారణాలకు మత్య వాత పడటం శోచనీయమని పేర్కొన్నారు. ఆశాలు, ఎఎన్ఎంలు, స్థానిక వైద్యులు అప్రమత్తంగా ఉండాలని మాతాశిశు మరణాలను నివారించాలని సూచించారు. గత నాలుగు నెలలుగా జరిగిన ఘటనల్లో తొమ్మిది మంది చిన్నారులు, నలుగురు తల్లులు మత్యువాత పడటం విచారకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని వైద్యులను కలెక్టర్ హెచ్చరించారు. కొన్ని సందర్భాల్లో కొంత మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, వారు అంత తీవ్రత లేకపోయినప్పటికీ సిజేరియన్ లు చేస్తున్నారని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

స్పందించిన కలెక్టర్ నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులకు నోటీసులు పంపించాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. స్థానిక ఆశాలు, ఏఎన్ఎంలు గర్భిణులకు అవగాహన కల్పించి ఆసుపత్రులను ఆశ్రయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ ఎస్.వి. రమణ కుమారి, డి. సిహెచ్ఎస్. నాగభూషణ రావు, ఐసిడిస్ పీడీ శాంత కుమారి, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మలీలా, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ధాన్యం సేకరణలో రైతులకు నష్టం రాకూడదు

జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-వేపాడ

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన మండల పరిషత్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్‌పి చైర్మన్‌తోపాటు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు. గత సమావేశంలో చర్చించిన సమస్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయని శాఖల వారీగా జెడ్‌పి చైర్మన్ ఆరాతీశారు. ప్రధానంగా వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. సారవానిపాలెం, సిట్టివానిపాలెం గ్రామాల గిరిజనులకు విద్యుత్తు సౌకర్యం కోసం జెడ్‌పి నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి జగనన్న గృహాల ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జెడ్‌పి చైర్మన్ అడిగిన ప్రశ్నకు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజు బదులిస్తూ మండలంలోని 29 పంచాయతీల పరిధిలో 75 గ్రామాలకు రూ.50 కోట్లతో ఇంటింటికి తాగునీరు అందించనున్నట్లు తెలిపారు.

సమావేశంలో డిసిసిబి చైర్మన్ వివి చినరామునాయుడు, డిపిఒ నిర్మల, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపిపి ఈశ్వర్‌రావు, ముత్యాలమ్మ, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

సచివాలయ సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది కార్యదర్శులు, సిబ్బంది పనితీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశామని, వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి మాత్రమే పనులు ప్రారంభించారని తెలిపారు. మిగతా సర్పంచులు పనులు ప్రారంభించేలా పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ చూపాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజు, ఎంపిపి సత్యవంతుడు, వైస్ ఎంపిపి ఎ.ఈశ్వరరావు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వికలాంగులను గుర్తించండి

విజయనగరం టౌన్ : సచివాలయాల వారీగా అర్హులైన దివ్యాంగులను గుర్తించేందుకు చర్యలు చేపట్టామని టిపిఆర్ఒ సింహాచలం తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో వెల్ఫేర్ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ నగరంలో ఉన్న సచివాలయాల పరిధిలో దివ్యాంగుల వివరాలను సేకరించాలని కార్యదర్శులకు సూచించారు. ఇప్పటికే పింఛన్లు అందుకుంటున్న వికలాంగుల వివరాలను, సదరం ధ్రువపత్రాలను పరిశీలించనున్నామని తెలిపారు.

జెవివి ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జన విజ్ఞాన వేదిక ఆధర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా మండలస్థాయి ప్రతిభా పరీక్ష జిల్లాలోని అన్ని మండలాల్లోనూ శుక్రవారం జరిగింది. అక్టోబర్ 18న జరిగిన పాఠశాల స్థాయి పరీక్ష 25వేల మంది విద్యార్థులు రాయగా, వీరిలో ఎంపికైన 900 మంది మండల స్థాయి పరీక్షకు హాజరయ్యారని జెవివి జిల్లా కార్యదర్శి రమణ్ ప్రభాత్ తెలిపారు. వీరిలో విజేతలైన వారు డిసెంబర్ 12న జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు.

బొండపల్లి : విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహ పెంచడం అత్యవసరమని బొండపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సన్యాసిరాజు అన్నారు. జెవివి ఆధ్వర్యాన చెకుముకి సైన్సు సంబరాల్లో ఆయన మాట్లాడుతూ నేడు శాస్త్రసాంకేతిక రంగాల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయని, ఫలితంగా అనేక ఆధునిక ఆలోచనలు ప్రజలకు అందుబాటులోకి వచ్చి వారి అవసరాలను మరింత సులభంగా అందుబాటులోకి తెస్తున్నాయని అన్నారు. నేటి విద్యార్థులు అందరూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న ఈ మార్పులను అందిపుచ్చుకొని కొత్త కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని అభిలషించారు. మండలంలోని మొత్తం 8 ఉన్నత పాఠశాలల నుండి 8 , 9 , 10 తరగతుల విద్యార్థులు ఈ ప్రతిభా పరీక్షలో పాల్గొన్నారు. భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు బి.రాజశేఖర్ సమన్వయ కర్తగా వ్యవహరించగా, జెవివి నాయకులు వి.రాజగోపాల్ ప్రధాన వక్తగా హాజరయ్యారు. పరీక్షల్లో బొండపల్లి హైస్కూల్ విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపిక అయ్యారు. దేవుపల్లి, రాచకిండాం విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. అనంతరం విజేతలకు బొండపల్లి పాఠశాల హెచ్ఎం బహుమతులు అందజేశారు.



విజయనగరంలో చెకుముకి పోటీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

బాడంగి : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభచూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం త్రినాథరావు తెలిపారు. పాల్తేరు జెడ్‌పి ఉన్న పాఠశాల విద్యార్థులు ద్వితీయస్థానం, గొల్లాది జెడ్‌పి పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. జెవివి మండల కన్వీనర్ కె.ఈశ్వరరావు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : మండల స్థాయి చెకుముకి పోటీలలో శికారు గంజి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 10వ తరగతిలో టి.ఉజ్వల, 9వ తరగతిలో ఎం జై గణేష్, 8వ తరగతిలో వి.ఛరిస్మా, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

జామి: జామి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చెకుముకి పోటీలకు స్పందన లభించింది. జామి, విజినిగిరి, కెజిబివి, రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, విజినిగిరి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. కెజిబివి విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు కొల్లి సూర్యనారాయణ, కార్యదర్శి పి.అప్పలరాజు పాల్గొన్నారు.



గ్రామీణ వాతావరణ కాలుష్యంపై వివరిస్తున్న రెల్లివలస హైస్కూల్ విద్యార్థులు

ఉత్సాహంగా సైన్సు కాంగ్రెస్

జిల్లా వ్యాప్తంగా 200పైగా ప్రాజెక్టులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని శ్రీచలపతి హైస్కూల్‌లో జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు శుక్రవారం జరిగాయి. మండల విద్యా శాఖ అధికారి ఎంఎస్ఎన్ రాజు ఈ పోటీలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 200 మందికి పైగా విద్యార్థులు పర్యావరణ పలు అంశాలపై ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. పర్యావరణం, ఆరోగ్యం, సంక్షేమం, పోషణ, ఆరోగ్యం, సామాజిక, సాంస్కతిక పద్ధతులు వంటి అంశాలపై వివరించారు. ఇందులో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రపోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త మిరియాల కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువ డిజైన్ మార్చాల్సిందే

రైతుల డిమాండ్

వేపాడ : పోలవరం ఎడమ కాలువ వల్ల చిన్న, సన్నకారు రైతులు అధిక సంఖ్యలో భూములు కోల్పోతున్నారని, వెంటనే కాలువ డిజైన్‌ను మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రామస్వామిపేటలో పోలవరం ఎడమ కాలువ భూసేకరణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొర ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ మాట్లాడుతూ ప్రస్తుత డిజైన్ వల్ల రైతులు నష్టపోతున్నారని, నష్టాన్ని తగ్గించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు మళ్లీ వేరేచోట భూమి ఇవ్వాలన్నారు. నష్టపరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌డిసికి వినతి అందించారు. కార్యక్రమంలో ఎడమ కాలువ డిఇలు, తహశీల్దార్ కృష్ణంరాజు, ఆర్ఐ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డిఎ, ఎరియర్స్ కోసం 22న కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ ధర్నా

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన డిఎ ఎరియర్స్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈనెల 22న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.రమేష్‌చంద్ర పట్నాయిక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు తెలిపారు. మెడికల్ అలవెన్సులు, పిఎఫ్ రుణాలు ఏడాది కాలంగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధర్నాలో జిల్లాలో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన

విజయనగరం : పీపుల్స్ హెల్త్ సొసైటీ ఫౌండర్ డైరెక్టర్ , జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి శుక్రవారం గురజాడ పబ్లిక్ స్కూల్లో ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక చికిత్స పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాథమిక స్థాయిలో చికిత్స అందజేస్తే చాలావరకు ప్రాణాపాయ పరిస్థితి నుండి రక్షించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పీపుల్స్ హెల్త్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ యోహాన్, మంజూరు బాషా, జెవివి జిల్లా అధ్యక్షులు ఆనంద్, డప్పుశ్రీను, గురజాడ స్కూల్ కరస్పాండెంట్ స్వరూప, మహిళా విభాగం నాయకులు ప్రమీలా పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- వేపాడ

డిసెంబర్ 3, 4వ తేదీల్లో బొబ్బిలిలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ ఇప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం దారుణమన్నారు. అధ్యాపకులు కూడా లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యను, సంక్షేమ వసతిగృహాలను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. దీనిపై మహాసభల్లో చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి -భోగాపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సిఎం కప్ వాలీబాల్ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగన్న ఆధ్వర్యంలో నాలుగు మండలాల నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ వైడ శ్రీరామ్ ప్రారంభించారు. 15 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పదాల భాను ప్రకాష్, పిఇటి లీలా కృష్ణ, కనకరాజు, రఘు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిపిఒ నిర్మల

సచివాలయాన్ని సందర్శించిన డిపిఒ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వల్లంపూడి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి నిర్మల పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇంతవరకు చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం నుంచి వేపాడ వెళ్లే రహదారి అడుగడుగున గుంతలయమైంది. దీనిపై ఈ నెల ఐదో తేదిన 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను శుక్రవారం పూడ్చటం ప్రారంభించారు. గోతులు పూడ్చడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

98 మందికి హోమియో వైద్య సేవలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కాసాపేట పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన హోమియో వైద్య శిబిరంలో 98 మందికి వైద్యులు సేవలు అందించారు. కీళ్ల నొప్పులు, వాతవ, దగ్గు , ఆయాసం వంటి వ్యాధులు అధికంగా గుర్తించినట్లు హోమియో వైద్యాధికారి కె.మోహనమూర్తి తెలిపారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ ఎం.ప్రభాకరరావు, ఎఎన్ఎం చైతన్య, ఆశ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

19, 20న కొత్త ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-రేగిడి

బూత్ స్థాయి అధికారులు ఈ నెల 19, 20 తేదీలలో కొత్త ఓటర్లను గుర్తించి, నమోదు చేయాలని తహశీల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పోలింగ్, బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొత్త ఓటర్లను గుర్తించి, ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఆధార్, రేషన్ కార్డు, వయసు ధ్రువీకరణ, ఒక పాస్ ఫొటో తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐలు ఉమా పట్నాయక్, విఆర్ఒలు గోపాల్, సత్యనారాయణ, సుశీల, బాబా, దొర తదితరులు పాల్గొన్నారు.

సింగవరంలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని సింగవరం ఆర్‌బికె పరిధిలోని కె.రమణ పొలంలో శుక్రవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. వ్యవసాయ శాఖ సూచనలు పాటించడం వల్ల రైతులకు సుమారు రూ.5 వేలు ఆదా అయినట్లు ఎఒ నిర్మల తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగుచేయడం వల్ల ఆరోగ్యవంతమైన పంటను పొందవచ్చని జెడ్‌బిఎన్‌ఎఫ్ డిపిఎం ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ రామకోటి పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న సర్పంచ్ లెంక లక్ష్మణరావు

పినతాడివాడలో దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పినతాడివాడలో ఇండియన్ దంతవైద్యశాల ఆధ్వర్యాన శుక్రవారం దంత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ లెంక లక్ష్మణరావు ప్రారంభించారు. శిబిరంలో 68 మందికి డెంటిస్టు ఎం.బాలాజి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపి దంతులూరి వెంకటవర్మ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎస్.కోట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల-2ను శుక్రవారం ఎంఇఒ పి.సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఇందిరమ్మకాలనీలో పందుల స్వైరవిహారం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా పందులు తిరిగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. కాలనీ సమీపంలో పందులను పెంచుతూ సంరక్షణ చేయకుండా బయటకు విడిచి పెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పందులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనులు పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని పారిశుధ్య పనులను, రావువారి వీధిలో నిర్మించిన సిసి రోడ్డును కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యావరణ కార్యదర్శితో కలిసి రావువారి వీధి, సంఘవీధి, ఆర్‌సిఎం స్కూలు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. సంఘ వీధి, చాకలి వీధులలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కొళాయిలు ప్రతిరోజు వస్తున్నది లేనిది, వీధి దీపాలు వెలుగుతున్నదీ లేనిదీ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో సంబంధిత వార్డు శానిటేషన్ సెక్రటరీ పై తీవ్రంగా మండిపడ్డారు.

కుష్టురోగులకు పాదరక్షలు పంపిణీ

విజయనగరం టౌన్ : విజయనగరం పూల్ బాగ్ కాలనీలో శుక్రవారం స్వయం సంరక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన 22 మంది కుష్టువ్యాధిగ్రస్తులకు లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో ఫాంటిల్స్ సంస్థ సహకారంతో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ కె.తిరుపతి రావు ప్రత్యేక పాదరక్షలు అందజేశారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు తిరుపతి రావు, దుర్గా ప్రసాద్, లెప్రా సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ మామిడి రాధిక, జిల్లా కోఆర్డినేటర్ లెంక రమణ పాల్గొన్నారు.

పథకాల అమలుకు బ్యాంకర్లు సహకరించాలి

- డ్వాక్రా సభ్యులు కానివారికీ రుణాలు అందించాలి
- వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు నాబార్డు రుణ సహాయం
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

పేదలకు అమలు చేసే పథకాలకు బ్యాంకర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని, వారి సహకారం లేనిదే లక్ష్యాలను చేరుకోలేమని జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి తెలిపారు. ఎన్ని సమావేశాలు నిర్వహించిన, ఎన్నెన్ని ప్రణాళికలు చేసినా బ్యాంకు అధికారులు సహకరిస్తేనే పురోగతి సాధించగలమని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో స్పెషల్ డిసిసి సమావేశం ఎల్.డి.ఎం శ్రీనివాస రావు ఆధ్వర్యం లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలకు రూ.35 వేల రుణం అందిస్తున్నారని, అదే విధంగా సంఘాల్లో లేని వారికి కూడా రూ.35 వేలు రుణంగా అందించడానికి బ్యాంకర్లకు ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం నుండి ఏ రకమైన హామీ కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, లే అవుట్లన్నీ టౌన్‌షిప్‌లుగా అభివృద్ధి చెందుతున్నాయని, మౌలిక వసతులు, రహదారులు అన్ని రకాల వసతులతో ఇప్పటికే 75 శాతం నిర్మాణాలు మొదలయ్యాయని తెలిపారు. బ్యాంకర్లు ఒక సారి లేఔట్ల పరిశీలనకు వెళ్ళాలని, వాటి విలువ ను బట్టి వారికి రుణాలు అందించాలని కోరారు. జగనన్న తోడు లో కూడా ప్రైవేటు బ్యాంకులు లక్ష్యాలను సాధించడంలో వెనకబడి ఉన్నాయన్నారు. డిసెంబర్ లోగా అన్ని దరఖాస్తులను గ్రౌండింగ్ చేయాలని తెలిపారు. ప్రతి బ్యాంకు రెండేసి గ్రామాల చొప్పున దత్తత తీసుకొని గృహాల రుణాలు, జగనన్న తోడు, తదితర పథకాలను ప్రత్యేక డ్రైవ్ ద్వారా గ్రౌండింగ్ చేయాలని అన్నారు. నాబార్డ్ డిడి టి. నాగార్జున నాబార్డు ద్వారా అందిస్తున్న పథకాలపై పవర్ పాయింట్ ద్వారా బ్యాంకర్లకు వివరించారు. వ్యవసాయానికి, ఆహార సంబంధిత యూనిట్లకు నాబార్డ్ క్రెడిట్ గ్యారంటీ లోన్ కింద రూ.2కోట్ల వరకు రుణ సదుపాయాన్ని కలిగిస్తోందన్నారు. అనంతరం రిజర్వ్ బ్యాంకు అఫ్ ఇండియా వారు ముద్రించిన ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ స్కీం కరపత్రాన్ని ఆవిష్కరించారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

సైబర్ ఆర్థిక నేరాల పట్ల జాగ్రత్త వహించాలి

బ్యాంకులలో జరిగే సైబర్ నేరాలపై సైబర్ పోలీస్ డిఎస్‌పి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. పరిచయం లేని వారు ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడితే అనుమతించకూడదని తెలిపారు. అనవసరమైన యాప్స్ డౌన్ లోడ్ చేయకూడదని, ఒటిపిలను చెప్పకూడదని చెప్పారు. ఎటిఎంలలో నగదు విత్ డ్రా చేసేటప్పుడు పిన్ ఎవరూ చూడకుండా చూసుకోవాలని తెలిపారు. బ్యాంకుల వద్ద జరిగే మోసాలకు పెద్ద గ్యాంగ్ లే ఉంటాయని, వారు ముందుగా రెక్కీ నిర్వహించుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారని, అలాంటి కేసు ల పట్ల బ్యాంకు అథారిటీ వారు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇకెవైసి అప్ లోడ్ చేసేటప్పుడు ఫోటో ను కూడా తప్పక అప్ లోడ్ చేయాలని, అప్పుడే ఈ నేరాల ఇన్వెస్టిగేషన్ త్వరగా చేయగలమని తెలిపారు. సమావేశం లో డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు కళ్యాణ చక్రవర్తి, సుధాకర రావు, జిల్లా అధికారులు , పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పిఎంఎంఎస్‌వై ద్వారా యువతకు ఉపాధి

ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా జిల్లాలో మత్స్యపరిశ్రమను అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఈ పథకం ద్వారా జిల్లాలో మత్స్య పరిశ్రమ వృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. పిఎంఎంఎస్‌వై పథకం అమలుపై, కలెక్టర్ తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2020-21, 2021-22 సంవత్సరాలకు సంబంధించి, పిఎంఎంఎస్‌వై పథకానికి జిల్లాలో మొత్తం 219 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. సాధారణ అభ్యర్థులకు 40 శాతం, మహిళలకు, ఎస్‌సి, ఎస్‌టి మత్స్యకారులకు 60 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.10.89 కోట్ల విలువైన ప్రాజెక్టులు, 2021-22 సంవత్సరానికి సంబంధించి రూ.15.01 కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. యూనిట్లను త్వరగా ఏర్పాటు చేయించడమే కాకుండా, అవి విజయవంతంగా నడిచేలా అధికారులు సహకరించాలని సూచించారు. సమావేశంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.నిర్మలకుమారి, జెడిపి సిఇఒ, డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిఆర్‌డిఎ పిడి ఎ.కళ్యాణి చక్రవర్తి, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వైవి రమణ, ఎల్‌డిఎం శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సానుకూల స్పందనలతో సామరస్యంగా..

సమస్యలపై వెనువెంటనే స్పందించిన ఎమ్మెల్యే • సాఫీగా సాగిన రామభద్రపురం మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అన్ని సమస్యలపైనా ఎమ్మెల్యే, అధికార పార్టీ సభ్యులు సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో మండల పరిషత్తు సమావేశం సాఫీగా కొనసాగింది. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల పరిషత్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు హాజరయ్యారు. తొలుత మండల వ్యవసాయ అధికారి వెంకటయ్య మాట్లాడుతూ గొల్లలపేట, తారాపురం, ఇట్లమామిడిపల్లి, రొంపల్లి గ్రామాల్లో 75 ఎకరాల వరకు వరి కోతలు పూర్తయినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలుకు గోని సంచులు, ప్లాస్టిక్ సంచులు వాడాలని సివిల్ సప్లై డిఎం ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ధాన్యం సేకరించిన 21 రోజుల్లో రైతులకు డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మండలంలోని రైస్‌మిల్లర్లకే ధాన్యం తరలించాలన్నారు. హౌసింగ్ ఎఇ సత్యంనాయుడు మాట్లాడుతూ వచ్చే నెల 21న సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రామభద్రపురం లేఅవుట్‌లో 342 ఇళ్లను సిద్ధం చేస్తున్నామన్నారు. గత టిడిపి ప్రభుత్వం హయాంలో సగం ఆగిపోయిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని మామిడివలస ఎంపిటిసి సభ్యులు మడక తిరుపతి నాయుడు కోరగా, ఎమ్మెల్యే శంబంగి కలుగజేసుకొని ముఖ్యమంత్రికి బిల్లుల విషయం తెలియజేశామని, వారి ఆదేశాలు హౌసింగ్ అధికారులకు వచ్చాయని వివరణ ఇచ్చారు. ఎంఇఒ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ఫేస్-1లో రామభద్రపురం మండలం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జి ఎఇ ఉమాగౌరి మాట్లాడుతూ వీధి లైట్ల బకాయిలు సర్పంచులే చెల్లించాలని స్పష్టంచేశారు. రామభద్రపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు మాట్లాడుతూ అదనంగా విద్యుత్తు స్తంభాలు కావాలని అడుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై ఎఇని ఎమ్మెల్యే వివరణ అడగ్గా, అన్ని గ్రామాల్లో సర్వే చేసి ఎన్ని స్తంభాలు కావాలో తెలియజేయాలన్నారు.

వైద్యాధికారులు గ్రామాల్లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందించడం లేదని సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. రామభద్రపురం పశువైద్య కేంద్రం ఆవరణలో భూకబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని టిడిపి ఎంపిటిసి సభ్యులు ఎమ్మెల్యేను కోరారు.

అనంతరం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ రూ.60.80 లక్షలు కాగా, 2023-24 సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూ.60.82 లక్షలను సభాముఖంగా ఆమోదించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, వైస్ ఎంపిపి పెంకి అరుణ, ఎంపిడిఒ రమామణి, తహశీల్దార్ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం : టిడిపి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామాభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు తెలిపారు. మండలంలోని రెల్లివలస గ్రామాభివృద్ధికి అక్కడ సర్పంచితోపాటు టిడిపి నాయకులు అడ్డుపడుతున్నారంటూ పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించారు. శుక్రవారం ఆయన రెల్లివలసలోని స్వగృహంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లలో ఏమి అభివృద్ధి చేశారంటూ వైసిపి నాయకులు ప్రశ్నించడం హాస్యాస్పదమన్నారు. గ్రామంలో హైస్కూల్, ఆసుపత్రి, వాటర్ ట్యాంకులు, రోడ్లు, అంగన్వాడీలు కనబడలేదా? అని ప్రశ్నించారు. గ్రామానికి అవసరమైన పనులు చేస్తే సహకరిస్తామని, తమకు గ్రామాభివృద్ధే ముఖ్యమన్నారు. వైసిపి నాయకుల్లా రాజకీయం చేసే ఉద్దేశం తమకు లేదన్నారు. సవాలు విసరడం, తేల్చుకోవడం పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టిపెడితే బాగుంటుందని హితవుపలికారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు, నాయకులు పతివాడ తమ్మునాయుడు, ఇజ్జురౌతు ఈశ్వర్రావు, టిడిపి అధికార ప్రతినిధి చందక ఆనందరావు, మహంతి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



గుర్ల.. సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు



డెంకాడ.. సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

పకడ్బందీగా చట్టాల అమలు

ప్రజాశక్తి-గుర్ల

రాష్ట్రంలో బాలల కోసం రూపొందించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో గుర్ల, నెల్లిమర్ల మండలాలకు చెందిన మహిళా సంరక్షణ కార్యదర్శులు, సంక్షేమ విద్యా సహాయకులతో బాలల న్యాయ చట్టాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల కోసం ప్రవేశ పెట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు వారికి అందేవిధంగా ఉన్నాయని తెలిపారు. ఎవరైనా బడి బయట పిల్లలు ఉంటే వెంటనే గుర్తించి బడిలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అనధికార దత్తత, భిక్షాటన, మత్తు పదార్థాల వినియోగంపై నిఘా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి.హిమబిందు, సభ్యులు సుధారాణి పట్నాయక్, భవాని, వైసిపి నాయకులు కె.వి. సూర్యనారాయణ రాజు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతి, మండల నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

డెంకాడ : విద్యార్థుల హక్కులకు భంగం కలిగిన కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి బిహెచ్‌వి లక్ష్మీకుమారి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మోపాడలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల హక్కులపై, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రముఖ సైకాలజిస్ట్ ఎస్.వి.రమణ మాట్లాడుతూ మానసికంగా బలంగా ఉండేందుకు సలహాలిచ్చారు. నేడు పోటీ ప్రపంచంలో నెగ్గుటకు మానసికంగా బలంగా ఎదగాలని కోరారు. సమగ్ర శిక్ష గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి మాలతి మాట్లాడుతూ విద్యార్థులతో చదువుతోపాటు నైతిక విలువలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మురళీధర్, సీనియర్ న్యాయవాది కె.గోదాదేవి, ప్రిన్సిపల్ జి.భవాని, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ.. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


ప్రజాశక్తి-పూసపాటిరేగ

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని హెచ్ఎం బి.శంకరరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయ నిర్వాహకులు పి.నాగేశ్వర్రావు అధ్వర్యంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న గ్రంథాలయాన్ని విద్యార్థులంతా ఉపయోగించుకోవాలని కోరారు.

బాడంగి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక హైస్కూల్లో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.

శృంగవరపుకోట : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బి.లక్ష్మి ఆధ్వర్యాన వివిధ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, చదరంగం, తదితర పోటీలు నిర్వహించారు.

వేపాడ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేపాడలో లైబ్రేరియన్ స్వామినాయుడు ఆధ్వర్యాన విద్యార్థులకు పరుగు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శివప్రసాద్ పాల్గొన్నారు.



జామి.. సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



వంగర.. సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి

'గడపగడపకు..'లో ఎమ్మెల్యే కడుబండి, కంబాల

ప్రజాశక్తి - జామి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం జామి గ్రామ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా జగనన్న పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలతో తామంతా సుఖ సంతోషాలతో జీవిస్తున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సిఎం జగన్‌కు ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారని చెప్పారు. జామి కొంతమంది సంక్షేమ పథకాలు అందలేదని తెలియజేయడంతో ఎమ్మెల్యే వాటి కారణాలు తెలుసుకుని, సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జామి, చింతాడ, విజినిగిరి సర్పంచులు చిప్పాడ లక్ష్మి, అప్పాన సుబ్రమణ్యం, సూర్యారావు, ఎంపిటిసి వాక సుధాకర్, నాయకులు అల్లు సత్యాజీ, జన్నివలస శ్రీరెడ్డి చంద్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ ఫలాలు

వంగర : అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని శివ్వాంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సర్పంచ్ బొక్కేల లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల కన్వీనర్ సుదర్శనరావు, నాయకులు బొక్కేల వెంకటప్పలనాయుడు, కనగల పారినాయుడు, ఏనుగుతల వెంకట నాయుడు, గారాల రథాలునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ దొంగ అరెస్ట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పలుచోట్ల సైకిళ్లను దొంగిలించిన వ్యక్తిని టూ టౌన్ సిఐ సిహెచ్ లక్ష్మణరావు ఆధ్వర్యాన సిబ్బంది పట్టుకున్నారు. పోలీసులకు అందిన సమాచారంతో ఎస్ఐ వై.పైడితల్లి తన సిబ్బందితో దాసన్నపేట రైతు బజార్ దగ్గరకు వెళ్లి అనుమానస్పద వ్యక్తులను విచారించారు. ఒక వ్యక్తి సైకిల్ పై వస్తూ పోలీసులను చూసి వెనక్కి తిరిగి వెళ్లిపోవడానికి ప్రయత్నించగా ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నిందితుడు దాసన్నపేట గొల్లవీధికి చెందిన మల్లెడ నారాయణరావుగా తేలింది. తరచూ సైకిళ్లను చోరీ చేస్తూ వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటాడని పోలీసులు తెలిపారు. మొత్తంగా 12 సైకిళ్ల దొంగతనం చేసినట్లు నిందితుడు అంగీకరించగా, వాటన్నింటినీ రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతు శ్రేయస్సుకే తొలి ప్రాధాన్యత


ప్రజాశక్తి-రామభద్రపురం

రైతు దేశానికి వెన్నెముకని నమ్మిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని తారాపురం గ్రామంలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రైతు భరోసా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపిపి బెల్లాన ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, ఎంపిడిఒ రమామణి, తహశీల్దార్ గణపతిరావు, వైసిపి నాయకులు వెంకటరమణ, చిన్నయ్య, చింతల సింహాచలం, డర్రు పైడిరాజు, అప్పారావు, ఏకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -భోగాపురం

మండలంలోని అమటాం రావివలస గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ప్రారంభించారు. ఆధార్‌కు సంబంధించిన అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. కొత్త ఆధార్ కార్డులు నమోదు, ఫోన్ నెంబర్ అనుసంధానం, చిరునామా, ఫొటో మార్పులు వంటి సేవలు పొందవచ్చన్నారు. సుమారు 15 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఇక్కడ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ స్వర్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశీ, డిజిటల్ అసిస్టెంట్ బంగార్రాజు, మహిళా పోలీస్ రీనాపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ సేవలు ప్రారంభిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శివారెడ్డి